# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 28-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కల్వరి క్లాస్ జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ లో ప్రయాణించారు.
- ❖ దేశ భద్రత విషయంలో రాజీపడేది లేదని "ఆపరేషన్ సింధూర్" రుజువు చేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ ఆయుష్మాన్ భారత్ యోజన ఆరోగ్య రంగంలో గణనీయమైన మార్పులను తీసుకువచ్చిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.
- ❖ "శాంతి" బిల్లు దేశ అణు రంగంలో ఒక చారిత్రాత్మక సంస్కరణగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అభివర్ణించారు.

======================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నౌకాదళ జలాంతర్గామిలో ఈ రోజు ప్రయాణించారు. కర్ణాటకలోని కార్వార్ నౌకాదళ స్థావరానికి చేరుకున్న రాష్ట్రపతి నేవీకి చెందిన కల్వరి క్లాస్ జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ లో ప్రయాణించారు. రాష్ట్రపతి వెంట నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె. త్రిపాఠి కూడా ఉన్నారు. కల్వరి క్లాస్ జలాంతర్గామిలో ప్రయాణించిన రెండో రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము నిలిచారు. గతంలో APJ అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా 2006 సంవత్సరంలో జలాంతర్గామిలో ప్రయాణించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి జలాంతర్గామి సిబ్బందితో సంభాషించారు. అనంతరం సందర్శకుల పుస్తకంలో రాష్ట్రపతి తన భావాలను రాస్తూ.. జలాంతర్గామిలో ప్రయాణించడం ప్రత్యేకమైన అనుభవంగా పేర్కొన్నారు.

======================

దేశ భద్రత విషయంలో రాజీ పడేది లేదని ఆపరేషన్ సింధూర్ రుజువు చేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మన్ కీ బాత్.. 129వ సంచికలో భాగంగా ఆకాశవాణి, దూరదర్శన్ ల ద్వారా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధానమంత్రి ఈ రోజు మాట్లాడారు. ఆపరేషన్ సింధూర్ ప్రతి భారతీయుడి గర్వానికి ప్రతీకగా నిలిచిందని ఈ

సందర్భంగా పేర్కొన్నారు. వర్తమాన భారతదేశం భద్రత విషయంలో ఎటువంటి వెనకడుగు వేయదన్నది ఆపరేషన్ సింధూర్ తో ప్రపంచం స్పష్టంగా చూసిందని ప్రధానమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

ఇదిలా ఉండగా వందేమాతరం గేయం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రజలు చూపించిన స్ఫూర్తిని నరేంద్ర మోదీ ప్రశంసించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సైన్స్, అంతరిక్ష రంగాలలో భారతదేశం ఈ ఏడాది మంచి పురోగతిని సాధించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆకాశవాణిలో మన్ కీ బాత్ కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి ఆయన ఈ రోజు మాట్లాడుతూ... 2025లో అనేక రంగాలలో దేశం ముందడుగు వేసిందని చెప్పారు. క్రీడల పరంగా కూడా బలమైన ముద్ర వేసిన సంవత్సరమని వ్యాఖ్యానించారు. భారత పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుందని, మహిళల క్రికెట్ జట్టు మొదటిసారిగా వన్డే ప్రపంచ కప్‌ను అందుకుందని తెలిపారు. అదే విధంగా ఆసియా కప్ టీ-20లో కూడా దేశం విజేతగా నిలిచిందన్నారు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అనేక పతకాలు సాధించిన పారా-అథ్లెట్లను కూడా ఈ సందర్భంగా ప్రధాని ప్రశంసించారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ యువత ఆలోచనలను ఆచరణలోకి మార్చే కీలక మాధ్యమంగా ఉంటుందని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (శాంతి) బిల్లు దేశ అణు రంగంలో ఒక చారిత్రాత్మక సంస్కరణగా కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అతిపెద్ద శాస్త్ర సంస్కరణలలో ఈ బిల్లు ఒకటని చెప్పారు. న్యూఢిల్లీలో పాత్రికేయులతో ఆయన ఈ రోజు మాట్లాడుతూ... భారతదేశ అణు విద్యుత్ సామర్థ్యం 2014లో దాదాపు 4.4 గిగా వాట్లు ఉండగా, ప్రస్తుతం దాదాపు 8.7 గిగా వాట్లకు రెట్టింపు అయిందని తెలిపారు. స్థిరమైన ఇంధన సామర్థ్యాన్ని అందించేందుకు అణు రంగంలో సంస్కరణలు దోహదపడతాయని అన్నారు. పునరుత్పాదక ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా నమ్మకమైన ఇంధన వనరుగా అణుశక్తి నిలుస్తుందని జితేంద్ర సింగ్ వెల్లడించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆయుష్మాన్ భారత్ యోజన ఆరోగ్య రంగంలో గణనీయమైన మార్పులను తీసుకువచ్చిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. అహ్మదాబాద్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిర్వహించిన నెట్‌కాన్-2025 లో ఆయన ముఖ్య అతిథిగా ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వైద్య రంగంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తన వంతు పాత్ర పోషిస్తోందని చెప్పారు. కరోనా వైరస్ కాలంలో వైద్యులు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఆయుష్మాన్ భారత్, జనరిక్ దుకాణాల సేవలను తక్కువ చేసి చూడవద్దని హోం మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ రేపటి నుండి పుదుచ్చేరి, కేరళ, తమిళనాడు రాష్ట్రాలలో రెండు రోజుల పర్యటన చేపట్టనున్నారు. పుదుచ్చేరి పర్యటనలో భాగంగా మహాకవి భారతియార్ విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు.. స్మార్ట్ సిటీ మిషన్ కింద ఒక గృహ నిర్మాణ ప్రాజెక్టును ఉప రాష్ట్రపతి ప్రారంభిస్తారు. అదేవిధంగా ఆయన పాండిచ్చేరి విశ్వవిద్యాలయంలో జరిగే 30వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. అదే రోజు కేరళలో జరిగే త్రివేండ్రం ఫెస్ట్-2025లో కూడా పాల్గొంటారు. రెండవ రోజు పర్యటనలో తమిళనాడులోని రామేశ్వరంలో జరిగే కాశీ-తమిళ సంగమం 4.0 ముగింపు వేడుకకు ఉప రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరవుతారని అధికార వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దట్టమైన పొగమంచు పరిస్థితుల కారణంగా ఉత్తర భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో విమానాలు, రైళ్ళు ఆలస్యంగా నడుస్తున్నాయి. మరి కొన్ని చోట్ల వీటి సేవలు నిలిచిపోయాయి. ఢిల్లీతో సహా అనేక నగరాల్లో విమానాల రాకపోకలు ఆలస్యమవుతున్నాయని, తక్కువ దృష్టిగోచరత పరిస్థితుల కారణంగా విమానాల షెడ్యూల్ మారవచ్చునని ఢిల్లీ విమానాశ్రయ పరిపాలన విభాగం హెచ్చరించింది. ఢిల్లీ విమానాశ్రయంలో 10 కంటే ఎక్కువ విమానాలు షెడ్యూల్ కంటే వెనుకబడి నడుస్తున్నట్లుగా పేర్కొంది. పలు రైళ్లు షెడ్యూల్ కంటే ఆలస్యంగా నడుస్తున్నాయని రైల్వే శాఖ అధికార వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, శ్రీలంక మహిళా జట్ల మధ్య టీ-20 సిరీస్ లో భాగంగా తిరువునంతపురంలోని గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా నాలుగవ టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన శ్రీలంక బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. శ్రీలంకకు 222 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భారత బ్యాటర్లలో స్మృతి మంధాన 80, షెఫాలీ వర్మ 79 పరుగులతో రాణించారు. ఈ టీ-20 క్రికెట్ మ్యాచ్ తో అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 10 వేల పరుగులు పూర్తి చేసుకున్న నాలుగో బ్యాటర్‌గా స్మృతి మంధాన రికార్డు నెలకొల్పింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్ భువనేశ్వర్‌లో బూత్ స్థాయి అధికారులతో (బీఎల్ఓ) ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించడానికి రేపు సమావేశం నిర్వహించనున్నారు. ఒడిశాలోని ఖోర్ధా, కటక్ జిల్లాలకు చెందిన సుమారు 800 మంది బీఎల్ఓలు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఓటర్ల జాబితా క్షేత్రస్థాయి ధృవీకరణలో బీఎల్ఓల కీలక పాత్రపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. రాష్ట్ర సీనియర్ ఎన్నికల అధికారులతో కూడా గ్యానేష్ కుమార్ సమావేశం కానున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దివంగత నేత, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ జయంతి సందర్భంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆయనకు ఈ రోజు నివాళులు అర్పించారు. ఈ మేరకు సామాజిక మధ్యమం ద్వారా పెట్టిన పోస్ట్‌లో అరుణ్ జైట్లీని అసమాన రాజ్యాంగ, న్యాయ నిపుణుడుగా అభివర్ణించారు. పార్లమెంటేరియన్‌గా ఆయన చేసిన కృషి గొప్పదని అన్నారు. పార్టీని బలోపేతం చేయడంలో కూడా అరుణ్ జైట్లీ అంకితభావంతో పని చేశారని అమిత్ షా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =